

సాగర్ సోయగాలు
పర్యాటక కేంద్రమైన సాగర్ జలాశయం నిండుకుండలా మారి సరికొత్త అందాలను సంతరించుకుంది. - 8లో



ఊంజలి సేవ
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి శుక్రవారం ఊంజలి సేవ నిర్వహించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	585.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,57,342 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,57,342 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,988 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,604 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,684 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

బీసీ లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు బీసీ లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుదారుల వయసు 24 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని, గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆగస్టు 15లోగా దరఖాస్తులను జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ శివ స్వరూపారాణిపై వేటు పడింది. ప్రిన్సిపాల్ అక్రమాలకు పాల్పడుతున్నారని.. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు ఫిర్యాదులు అందడంతో గత నెల 28న పాఠశాలలో డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ విచారణ చేపట్టి నివేదికను డైరెక్టర్‌కు అందచేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఎస్.శివ స్వరూపరాణిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులు



ప్రగతి చక్ర అవార్డులు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

రామగిరి (నల్లగొండ) : విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఆర్టీసీ సిబ్బందికి రీజియన్ స్థాయిలో ఏప్రిల్, మే, జూన్ నెలల ప్రగతిచక్ర అవార్డులను ఆర్‌ఎం జానిరెడ్డి శుక్రవారం నల్లగొండలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందన్నారు. రీజియన్ పరిధిలో 28 మంది సిబ్బందికి ప్రగతిచక్ర అవార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం, అన్ని డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుదారుల జాబితా విడుదల

నల్లగొండ: మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసే.. మోటరైజ్డ్ వాహనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి జాబితాను కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే.. ఈ నెల7 న సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించాలి

కనగల్ : విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం కనగల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొనాలన్నారు. అనంతరం పాఠశాలలో, కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.పద్మ, కాంప్లెక్స్ హెచ్‌ఎం డి.విద్యాభార్గవి, కేజీబీవీ ఎస్‌ఓ స్వప్న పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమికొట్టండి



సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్

మిర్యాలగూడ అర్బన్ : డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్‌లను నిర్మూలించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవినాయక్, మల్లం మహేష్ కోరారు. జిల్లావ్యాప్త చైతన్య సైకిల్ యాత్రలో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సైకిల్ యాత్రలో వారు మాట్లాడారు. మత్తుకు బానిసలుగా మారుతున్న యువత అగాయిత్యాలకు పాల్పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటోందన్నారు. ఆన్‌లైన్ యాప్‌ల వల్ల లక్షల రూపాయలు పోగొట్టుకుని ఆత్మహత్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైకిల్ యాత్ర సభ్యులు పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్, సుధాకర్, శశిధర్, రాజేష్, సాయితేజ పాల్గొన్నారు.

1600 మెగావాట్ల విద్యుత్

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని రెండు యూనిట్లలో ఉత్పత్తి



వైటీపీఎస్ వద్ద టౌన్‌షిప్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా తదితరులు

- ఈ ఏడాది జనవరిలో సీఎం చేతుల మీదుగా యూనిట్–2 ప్రారంభం
- శుక్రవారం యూనిట్–1ను జాతికి అంకితం చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- వచ్చే ఏడాది జనవరి నాటికి మిగతా మూడు యూనిట్లు పూర్తి చేయాలని ఆదేశం
- టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన
- పనులపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి సమీక్ష



నిర్వాసితులతో మాట్లాడుతున్న భట్టి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ద్వారా శుక్రవారం నుంచి 1600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. జనవరి నెలలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పవర్ ప్లాంట్‌లోని రెండో యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. దాంతో 800 మెగావాట్ల సామర్థ్యంతో కమర్షియల్ విద్యుదుత్పత్తి చేస్తుండగా, శుక్రవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క యూనిట్–1 నుంచి జాతికి అంకితం చేశారు. దాంతో మరో 800 మెగావాట్లు కలుపుకొని 1600 మెగావాట్ల సామర్థ్యంతో కమర్షియల్ విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. వైటీపీఎస్ యూనిట్ –1 ప్రారంభం అనంతరం రూ.970 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన చేశారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం వైటీపీఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. మరో మూడు యూనిట్లను వచ్చే ఏడాది జనవరి 26 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులు ఆదేశించారు. పవర్ ప్లాంట్ ద్వారా మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తిని వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఏడాది కాలంలోనే స్టేజ్–1లోని రెండు యూనిట్లను పూర్తి చేయడంపై ఆయన వైటీపీఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. పవర్ ప్లాంట్‌లో అన్ని సౌకర్యాలు బాగుండేలా.. అభివృద్ధి చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల, ఆస్పత్రి నిర్మించి పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. పవర్ ప్లాంట్ ఆవరణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిర్వాసితులకు ఉద్యోగాలిస్తున్నాం : మంత్రి ఉత్తమ్

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భూములు పోయిన పరిహారంతోపాటు ఉద్యోగాలు ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే విష్ణుపురం డబుల్ రైల్వే లైన్ మంజూరు అయ్యిందని.. ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వైటీపీఎస్ వద్దకు రహదారుల పూర్తికి రూ.280 కోట్లు మంజూరు చేయడంతోపాటు.. క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో పవర్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రాజెక్టు నుంచి ఎలాంటి సహకారం అందించడం లేదన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ వైటీపీఎస్‌లోని అన్ని విభాగాల్లో లాగ్‌బుక్ ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరిగా చేయాలని, ప్రతి ఉద్యోగి కార్డుతోనే యాక్సెస్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైటీపీఎస్ ప్రస్తుత పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, హైడల్ డైరెక్టర్ బాలరాజు, కోల్ డైరెక్టర్ నాగయ్య, థర్మల్ డైరెక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి, జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్, జెన్‌కో హెచ్‌ఆర్ డైరెక్టర్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు చేరుకున్న నాలుగో యూనిట్ పనులు

పవర్ ప్లాంట్‌లోని 3, 4, 5 యూనిట్ల పనులు కొనసాగుతున్నాయి. నాలుగో యూనిట్ పనులు చివరి దశకు చేరుకున్నారు. గత ఏడాది నవంబర్‌లోనే నాలుగో బాయిలర్ లైటింగ్ (స్టీమ్ జనరేషన్) పనులు పూర్తికాగా, ప్లాంట్ సింక్రనైజేషన్‌కు సంబంధించి బాయిలర్ స్టీమ్ బ్లోయింగ్ ఆపరేషన్, నార్మలైజేషన్ పనులను ఈ నెల చివరి నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇక యూనిట్–3 బాయిలర్ లైటింగ్ పనులు గత ఏడాది ఫిబ్రవరిలోనే పూర్తి కాగా, బాయిలర్ కెమికల్ క్లీనింగ్ కూడా పూర్తయింది. ఇక స్టీమ్ బ్లోయింగ్ ఆపరేషన్ పనులను గత నెల 22వ తేదీన ప్రారంభించారు. మొత్తానికి యూనిట్–3 సింక్రనైజేషన్‌ను వచ్చే సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి, అక్టోబర్‌లో కమర్షియల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా పనులను చేపట్టారు. యూనిట్–5 బాయిలర్ హైడ్రాలిక్ పరీక్ష పూర్తికాగా, బాయిలర్ లైటింగ్ పనులను ఈ నెలలోనే చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన టర్బైన్ నిర్మాణ పనులను ఇంకా కొనసాగుతున్నాయి. డిసెంబర్‌లో సింక్రనైజేషన్ పూర్తి చేసి, 2026లో ఫిబ్రవరిలో కమర్షియల్ ఆపరేషన్ ప్రారంభిస్తామని నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్ పేర్కొంది.



వైటీపీఎస్ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న భట్టి, మంత్రులు



పవర్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తదితరులు

248 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు



నల్లగొండ : విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టారు. జిల్లాలో ఎన్‌రోల్‌మెంట్ లేని పాఠశాలలు, విద్యార్థుల కంటే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలలనుంచి ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి అనుమతితో జిల్లాలో 248 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. స్కూల్ అసిస్టెంట్లను కాంప్లెక్స్ నుంచి నియోజకవర్గ పరిధిలో.. ఎస్‌జీటీలను కాంప్లెక్స్ పరిధిలో అవసరమున్న పాఠశాలలకు సర్దుబాటు చేశాయని ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో 69 మంది స్కూల్ అసిస్టెంట్లును, 179 మంది ఎస్‌జీటీలను సర్దుబాటు చేస్తూ డీఈఓ భిక్షపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల విద్యాధికారులు ఆయా ఉపాధ్యాయులను పాఠశాలల నుంచి రిలీవ్ చేయడంతో పాటు సర్దుబాటు చేసిన పాఠశాలల్లో రిపోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైన ఉపాధ్యాయులు జాయిన్ కాకపోతే సీసీఏ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీలు అమలు చేయాల్సిందే



జిల్లా సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల సమయంలో చేయూత పింఛనుదారులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు వరకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం మిర్యాగూడలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పింఛన్‌దారుల జిల్లా సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. తీవ్ర అంగవైకల్యం కలిగిన కండరాల క్షీణిత వ్యాధి గ్రహస్తులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.15 వేల ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.15 వేలు ఇస్తుంటే తెలంగాణలో ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌లో దివ్యాంగుల మహాగర్జనకు సంబంధించిన సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త జానకిరామయ్య చౌదరి, రాష్ట్ర నేత అహ్మద్‌ఖాన్, అందె రాంబాబు, గద్దం ఖాసీం, వెంకటాచారి, సైదులు, రాజేష్, చైతన్యరెడ్డి, ఇంద్రచౌదరి, శ్రీనివాస్, రామేశ్వరీ, లక్ష్మి, సువర్ణ, శంకర్, మధన్‌నాయక్, నాగరాజు, సైదులు, నర్సింహ, వెంకన్న పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

నల్లగొండ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలె పెట్టిందన్నారు. దాన్ని అమలు చేసేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడు రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నారని.. తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి మాట్లాడుతూ మహాధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు వెళ్లేలా సమాయత్తం చేస్తామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి జాన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సుంకరి బిక్షం గౌడ్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, గౌరవ అధ్యక్షుడు సత్తయ్య, శ్రీనివాసరెడ్డి, యూసుఫ్‌పాష, మారం వెంకటరెడ్డి, సునీల్, శంకరయ్య, సువర్ణ, సత్తిరెడ్డి, గోపాల్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

106 మంది బాల కార్మికులకు విముక్తి



నల్లగొండ : జూలై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 106 మంది బాల కార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖతోపాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ శాఖల అధికారుల సమన్వయంతో బృందాలుగా ఏర్పడి 106 మందికి విముక్తి కల్పించినట్లు వెల్లడించారు. వీరిలో 94 మంది బాలలు, 12 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. బాల కార్మికుల చేత ఎవరైనా పనులు చేయించుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరికైనా బాల కార్మికుల సమాచారం తెలిస్తే డయల్- 100, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

స్పీడ్ గన్ చూస్తోంది..

చౌటుప్పల్ రూరల్: వాహనాలను అతివేగంతో నడపడం వల్ల చోదకులు ప్రమాదాలకు గురవడమే కాకుండా ఎదుటివారిని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.ఈ నేపథ్యంలో వాహనాల వేగ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం పరిధిలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చెట్లమాటున స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని రికార్డ్ చేశారు. పరిమితికి మించిన వేగంతో వెళ్తే వెంటనే వాహనదారుడి సెల్‌ఫోన్ లేదా, వాహనం నంబర్ ఆధారంగా ఎంత జరిమానా చెల్లించాలనే సమాచారం వస్తుంది. గంటకు 90 కి.మీ వేగం మించితే చలానా వస్తుందని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ తెలిపారు.



వాహనాల వేగాన్ని స్పీడ్‌గన్‌తో రికార్డ్ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

డుమ్మా కొట్టలేరు..!

ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు అమలు

- హాజరు పక్కాగా ఉండేలా విద్యాశాఖ చర్యలు
- జిల్లాలో 1483 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు
- 6,556 మంది ఉపాధ్యాయులు.. తొలిరోజు 3,854 మంది రిజిస్ట్రేషన్
- మెరుగుపడనున్న విద్యా బోధన



మొదటి రోజు 3854 మంది నమోదు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించి తమ సెల్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అయితే మొదటి రోజు ఆయా పాఠశాలల్లో 3854 మంది ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్ విధానం పూర్తయిందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని టెక్నికల్ సమస్య వల్ల మొదటి రోజు 2,712 మంది ఇంకా రిజిస్టర్ చేసుకోలేదు. రెండు మూడు రోజుల్లో సాంకేతిక సమస్యలను అధిగమించి ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేలా విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

నల్లగొండ : డుమ్మా టీచర్లకు ఇక చెక్ పడనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని విద్యాశాఖ తీసుకొచ్చింది. పాఠశాలలకు రాకుండా, విద్యార్థులకు పాఠాలు బోధించకుండా విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని రూపొందించింది. ఉపాధ్యాయుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని శుక్రవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. సంబంధిత ఉద్యోగి సెల్‌ఫోన్‌లోనే టీజీఎఫ్‌ఆర్ఎస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వారి హాజరును నేరుగా ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంటుంది. గత విద్యా సంవత్సరం నుంచి ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ఉపయోగించి పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేస్తున్నారు. అదే తరహాలో ఉపాధ్యాయుల హాజరును కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో 1483 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో 1483 ప్రభుత్వ, జిల్లా పరిషత్, యూఆర్ఎస్, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 6,556 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉద్యోగుల సమయ పాలనకు కొత్తగా ప్రవేశపెట్టి టీజీఎఫ్‌ఆర్ఎస్ యాప్‌ను సంబంధిత ఉద్యోగి స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేస్తారు. మొదటగా ఉద్యోగి వివరాలతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ కావాలి. యాప్ ఇన్‌స్టాలేషన్ సమయంలోనే సంబంధిత కార్యాలయం, పాఠశాల ఆవరణ లాంగిట్యూడ్, లాటిట్యూడ్లను టెక్నీషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒక్కసారి లాగిన్ అయిన తరువాత యాప్ నిరంతరంగా వినియోగించవచ్చు. ఇక ఉద్యోగి ఉదయం నిర్దేశిత సమయానికి పాఠశాలకు వచ్చిన తర్వాత యాప్‌ను ఓపెన్ చేసి క్లాక్ ఇన్ అనే ఆప్షన్ నొక్కితే సదరు ఉద్యోగి వచ్చిన సమయం ఆన్‌లైన్‌లో సంబంధిత పర్యవేక్షణ అధికారికి చేరుతుంది. పాఠశాలలో పని సమయం ముగిసిన తర్వాత క్లాక్ ఔట్ అనే ఆప్షన్‌పై టచ్ చేస్తే ఉద్యోగి కార్యాలయాన్ని విడిచి వెళ్లే సమయాన్ని, పని చేసిన గంటలను లెక్కించి తిరిగి సంబంధిత పర్యవేక్షణ అధికారి ఆన్‌లైన్‌లో చేరుతుంది.

ఉత్తమ బోధనే లక్ష్యంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. విద్యార్థులకు ఉత్తమ బోధనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసింది. చాలామంది పనిచేస్తున్న చోట నివాసం ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ స్కూళ్లకు వేళకు చేరుకోవడం లేదు. ప్రధాపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరస్పరం సహకరించుకుంటూ విధులకు హాజరు కాకున్నా మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలకు ఉపాధ్యాయులు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు రావడంతో ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదు అమల్లోకి తెచ్చింది. ఇక విద్యార్థులకు మరింతగా నాణ్యమైన, ఉత్తమ బోధన అందనుందని పలువురు విద్యా నిపుణులు పేర్కొంటున్నారు.

సాంకేతిక ఇబ్బందులు అధిగమిస్తాం

ఉపాధ్యాయులకు ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదులో మొదటిరోజు కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలతో కొందరు ఉపాధ్యాయులు హాజరు నమోదులో ఇబ్బందులు ఏర్పడ్డాయి. రెండుమూడు రోజుల్లో అవి పూర్తిగా పరిష్కారమవుతాయి. ప్రతి ఉపాధ్యాయుడు కచ్చితంగా ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందే. అలా చేయకపోతే గైర్హాజర్ ఆన్‌లైన్‌లో చూపుతుంది.

– భిక్షపతి, డీఈఓ

క్లుప్తంగా

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి శుక్రవారం ఊంజలి సేవను పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సాయంత్రం వేళ అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సమయంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్టించి ఊంజలి సేవ చేపట్టారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు

డిండి: బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి డిండి మండలం బొల్లనపల్లి గ్రామ స్టేజీ సమీపంలో జరిగింది. శుక్రవారం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన లక్కు విజయభాస్కర్‌రెడ్డి(18), ఎం. సిద్దార్థరెడ్డి, ప్రకాష్‌రెడ్డి గురువారం శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని రాత్రి బైక్‌పై ముగ్గురు కలిసి నాగార్జునసాగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో డిండి మండలం బొల్లనపల్లి గ్రామ స్టేజీ సమీపంలో వీరి బైక్ అదుపుతప్పడంతో మధ్యలో కూర్చున్న విజయభాస్కర్‌రెడ్డి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన సిద్దార్థరెడ్డి, ప్రకాష్‌రెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం దేవరకొండకు తరలించారు. శుక్రవారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం విజయభాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ సోయగాలు



నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నిండుకుండలా మారి సరికొత్త అందాలను సంతరించుకుంది. ఐదురోజులుగా ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈ దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. జలాశయంలో లాంచీల్లో విహరిస్తూ చుట్టూ పచ్చని ఎత్తైన కొండలను చూస్తూ నాగార్జునకొండకు వెళ్లడం పర్యాటకులకు మరుపురాని అనుభూతి. సాగర్ అందాలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటలకు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి వసతి, సాగర్ చుట్టుపక్కల దర్శనీయ ప్రదేశాలపై ప్రత్యేక కథనం..





చూసొద్దాం.. రండి

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా నాగార్జునసాగర్
- చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచే నందికొండ, బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం
- చెప్పలేని అనుభూతిని మిగిల్చే లాంచీ విహారం

సాక్షి Weekend

నాగార్జున కొండ మ్యూజియం

నాగార్జునకొండ ప్రపంచలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. ఇక్కడకు హిల్ కాలనీ లాంచీ స్టేషన్ నుంచి 20కి.మీ. దూరం(గంట సమయం) కృష్ణా నదిలో ప్రయాణిస్తే చేరుకోవచ్చు. హిల్‌కాలనీ లాంచీ స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు అందుబాటులో ఉంటాయి. లాంచీ టిక్కెట్ పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150. మ్యూజియం మాన్యుమెంట్ సందర్శనకు టిక్కెట్ రూ.30. 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15శాతం రాయితీ ఉంటుంది.



బుద్ధవనం



సాగర్ జలాశయ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం నిర్మితమైంది. ప్రపంచంలోని బౌద్ధ దేశాలలో బుద్ధుడికి సంబంధించిన స్మృతులు బుద్ధవనంలోని మహాస్తూపం డోమ్‌పై చెక్కబడ్డాయి. సిద్ధార్థుడి జననం, బాల్యం, తదితర దశల్లో వ్యవహరించిన తీరు బుద్ధవనాన్ని సందర్శించి తెలుసుకోవచ్చు. బుద్ధవనం సందర్శనకు పెద్దలకు టికెట్ ధర రూ.100, పిల్లలకు రూ.50. ఇక్కడ ఐదు గదులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇస్తారు. ఏసీ గది రూ.1500, నాన్ ఏసీ గది రూ.1200 ఉంటుంది. ఇతర వివరాలకు 97058 15303 నంబర్‌ను సంప్రదించవచ్చును.

మనసు దోచే ఎత్తిపోతల



నాగార్జునసాగర్ నుంచి ఏపీలోని మాచర్లకు వెళ్లే దారిలో 14 కిలోమీటర్ల దూరంలో ఎత్తిపోతల జలపాతం ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం వద్ద 70 అడుగుల పైనుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. ఈ జలపాతం చూసేందుకు టిక్కెట్ ధర పెద్దలకు రూ.30 కాగా పిల్లలకు రూ.20. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 గదులు కూడా అందుబాటులో ఉన్నాయి.

గత ఆనవాళ్లకు చిరునామా అనుపు



హిల్‌కాలనీకి 15 కిలోమీటర్ల దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ అలనాటి నాగార్జున విశ్వవిద్యాయం, ఇక్ష్వాకుల యాంఫీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణా నది లోయలో లభించిన రంగనాథస్వామి ఆలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణా నది తీరంలో నిర్మించడం విశేషం. తొలి ఏకాదశి పర్వదినాన ఇక్కడికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

- హిల్‌కాలనీ లాంచీ స్టేషన్: 7997951023
- ఎత్తిపోతల : 9441453115, 9494347946
- విజయపురి నార్త్ ఎస్ఐ: 8712670197
- సాగర్ మాత దేవాలయం: 9581642488
- పైలాన్ కాలనీ టైగర్ వ్యాలీ హోటల్: 915439303
- పార్కింగ్ హోటల్ అండ్ రెస్టారెంట్: 7993750209
- విజయపురి సౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్: 8500718552, 7901084959

పచ్చందాల అర్బన్ పార్కు



సాగర్ జలాశయ తీరంలో నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల) వెంట రూ.1.5కోట్లతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీ కోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు పచ్చందాలను ఆరబోస్తోంది. 980 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పార్కు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంలోని గుట్టల మధ్యన సాగర్ బ్యాక్ వాటర్ అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. అటవీ అందాలను వీక్షించేందుకు రెండు రకాల సఫారీ వాహనాలను ఏర్పాటు చేశారు. వాహనంలో 10 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1,000, 24 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500 వసూలు చేస్తున్నారు. సిబ్బంది కొరత మూలంగా పర్యాటకులు అడిగితేనే సఫారీ వాహనాలను నడుపుతున్నారు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం



నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్ వే పక్కన ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ విద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో సీఈ, ఎస్ఈల ప్రత్యేక అనుమతి తీసుకుని పర్యాటకులు సందర్శించాల్సి ఉంటుంది. విజ్ఞాన యాత్ర కోసం నాగార్జునసాగర్‌కు వచ్చే విద్యార్థులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి నీటితో విద్యుదుత్పాదన చేసే విధానాన్ని వివరంగా తెలుసుకోవచ్చు.

సాగర్ మాత పుణ్యక్షేత్రం



విజయపురి సౌత్‌లోని కృష్ణా నది తీరంలో సాగర్ మాత దేవాలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా సాగర్ మాతకు పేరుంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతి ఏడాది మార్చి నెల మొదటి వారంలో మూడురోజుల పాటు సాగర్ మాత ఉత్సవాలు జరుగుతాయి.

ఆతిథ్యమిస్తున్న హోటళ్లు

నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు అనుగుణంగా హోటళ్లు పెద్ద సంఖ్యలో వెలిశాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండటంతో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. దీంతో హోటల్ బిజినెస్ కూడా పెరిగింది. హిల్‌కాలనీలో విజయ్‌విహార్‌లో నడుస్తున్న హోటల్‌లో దేశ, విదేశీయులు తినే పలురకాల వంటకాలు లభ్యమవుతున్నాయి. అలాగే బుద్ధవనంలో సిద్ధార్థ హోటల్, మనోరమ హోటల్, పైలాన్‌కాలనీలో ఇటీవల ఏర్పాటైన టైగర్ వ్యాలీ హోటళ్లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కొత్త బ్రిడ్జి అవతలి వైపున ఉన్న మాతా సరోవర్, రైట్ బ్యాంకులో మాతా సరోవర్ హోటళ్లు వెలిశాయి. పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో హిల్‌కాలనీలో విజయ్‌విహార్ హోటల్‌లో 34 గదులు ఉన్నాయి. ముందస్తుగా ఆన్‌లైన్‌లో టీడీటీజీసీ.ఇన్ సైట్ ద్వారా బుక్ చేసుకోవాలి. వివరాలకు 08680–277362 నంబర్‌ను సంప్రదించాలి.



దుకాణాల పైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- మహిళకు తీవ్ర గాయాలు



ట్రాక్టర్ వద్ద గుమికూడిన స్థానికులు

ఆలేరు: డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్ నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆలేరు పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని పెద్దవాగు నుంచి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక తరలించేందుకు జూకంటి సంపత్ ట్రాక్టర్‌కు తహసీల్దార్ ఆంజనేయులు పర్మిషన్ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం డ్రైవర్ కమల్‌హాసన్ వాగు వద్ద ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని కనకదుర్గ గుడి మార్గంలో ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తున్నాడు. ఆర్‌కె సినిమా థియేటర్ వెళ్లే దారి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ ఉడెన్ ఫర్నీచర్ వర్క్స్‌షాప్ పైకి దూసుకెళ్లింది. దీంతో షాపులోని వర్కర్లు బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న కొలనుపాకకు చెందిన వల్లెపు రాజమణిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఫర్నీచర్ షాపు ఎదుట పార్కింగ్ చేసిన స్కూటీ నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన మహిళను ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. అయితే ఆలేరు నుంచి జనగామ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రాంగ్‌రూట్‌లో ఎదురుగా రావడంతో అతడిని తప్పించే క్రమంలోనే ట్రాక్టర్ దుకాణాల పైకి దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

పాఠశాల గోడ దూకి పారిపోయిన విద్యార్థి

- స్థానికులు గుర్తించి ఉపాధ్యాయులకు అప్పగింత

మోత్కూరు: మోత్కూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల గోడ దూకి పారిపోయిన విద్యార్థిని స్థానికులు గుర్తించి స్కూల్ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న దీక్షిత్ శుక్రవారం పాఠశాల గోడ దూకి పారిపోయాడు. స్థానిక చెరువు కట్ట వద్దకు చేరుకుని ఏడుస్తూ ఉండగా.. స్థానికులు అతడిని గమనించి వివరాలు అడిగారు. దీంతో అతడు 'ఫోన్ ఇవ్వండి.. మా అమ్మానాన్నలకు ఫోన్ చేయాలి' అని చెప్పడంతో వెంటనే స్కూల్ యజమాన్యానికి సమాచారం ఇచ్చారు. దీక్షిత్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ కోమటి మత్స్యగిరి, దండ్ల కళ్యాణ్, భిక్షపతి, అన్నందాస్ వినయ్, సంజీవ వెంటనే స్పందించి బాలుడిని పట్టుకొని మంచి నీళ్లు తాగించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే స్కూల్ ఉపాధ్యాయులు అక్కడికి చేరుకోవడంతో వారికి బాలుడిని అప్పగించారు. గురువారమే దీక్షిత్‌ను తండ్రి మల్లేష్ స్కూల్‌లో వదిలి వెళ్లాడని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ శారదను వివరణ కోరగా.. దీక్షిత్ మధ్యాహ్నం వంట చేసే సిబ్బందితో పాటు బయటకు వెళ్లాడని, టీచర్లు గుర్తించి స్కూల్‌కు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

పోలీసులపై దాడి చేసిన యువకులపై కేసు

మునగాల: మునగాల మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై దాడికి పాల్పడిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన రాము, ప్రదీప్, వీరబాబు, మణికంఠ, శివసాయి, మహేష్, నాగ గోపితో పాటు పలువురు యువకులు గురువారం రాత్రి ఘర్షణ పడుతుండగా.. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది బాలకృష్ణ, శ్రీనివాస్‌పై సదరు యువకులు రాళ్లు విసరడంతో కానిస్టేబుల్ బాలకృష్ణకు గాయాలయ్యాయి. బాలకృష్ణను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. మరో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శంకర్ (ఫైల్)

మునగాల, మిర్యాలగూడ టౌన్: సాగర్ ఎడమ కాలువలో ఈతకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం మునగాల మండల కేంద్రం శివారులో లభ్యమైంది. మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన చౌగాని శంకర్(38) తన స్నేహితులతో కలిసి బుధవారం గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. శంకర్ మృతదేహం శుక్రవారం మునగాల మండల కేంద్రం శివారులో సాగర్ ఎడమ కాలువలో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొని వెళ్తుండగా స్థానికులు గమనించి మునగాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో ఎడమ కాలువ వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పలు పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. మిర్యాలగూడ రూరల్ పోలీసులు స్పందించి శంకర్ కుటుంబ సభ్యులను అక్కడికి తీసుకెళ్లగా మృతదేహం శంకర్‌దేనని గుర్తించారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా.. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన పాలమాకుల సోమయ్య(45), ధనలక్ష్మి దంపతులు కోడిగుడ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మునగాల మండలం ఆకుపాములలో కోడిగుడ్లు కొనుగోలు చేసి తమ సొంత ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా.. ఆకుపాముల గ్రామ శివారులోని జియో పెట్రోల్ బంబక్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమయ్య, ధనలక్ష్మి దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహంనంలో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమయ్య మృతిచెందాడు. సోమయ్య భార్య ధనలక్ష్మి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మృతుడి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.